సాక్షి జగిత్యాల

మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



ఆలయ వార్షికోత్సవం

ధర్మపురి: గోదావరి తీరంలోని శ్రీమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం అర్చకుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



కల్యాణం.. కమనీయం

కోరుట్ల : శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీఆలయంలో సోమవారం రుక్మిణి – శ్రీకృష్ణుని కల్యాణం వైభవంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0/25.0

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి పూట ఉక్కపోతగా ఉంటుంది. వేడి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

తల్లి పాదాల కింద స్వర్గం ఉంది.

– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6.34	బుధ 4.36

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మకరంద్

జగిత్యాల: ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మకరంద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి ద్వారా పలువురి నుంచి 23 అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అనేక సమస్యలతో ఇక్కడకు వస్తారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష కేంద్రాల తనిఖీ

ధర్మపురి/వెల్గటూర్: పట్టణంతోపాటు వెల్గటూర్ మండలంలోని పలు పదో తరగతి పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకురాలు ఉషారాణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు కల్పించిన వసతులు, పరీక్షల ఏర్పాట్లు, పలు రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్య సంబంధిత సమస్యలు ఎదురైతే తక్షణం వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. ధర్మపురి మండల విద్యాధికారి భూమయ్య, సీఎస్‌లు, డీవోలు ఉన్నారు.

ఇథనాల్ పరిశ్రమ వద్దని గ్రామపంచాయతీ తీర్మానం



తీర్మానం కాపీ అందిస్తున్న పాలకవర్గం

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ పరిశ్రమకు ఏర్పాటును వ్యతిరేకిస్తూ వెంకటాపూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం సోమవారం తీర్మానం చేసింది. తొలుత గ్రామసభ ఏర్పాటు చేశారు. పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంతో దాని పరిధిలోని సుమారు 5 కి.మీ. వరకు కాలుష్యం వెదజల్లుతుందన్నారు. భూగర్భ జలాలు, గాలి, నీరు కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా భవిష్యత్తులో ఈ ప్రాంతంలో ప్రజలు నివసించే పరిస్థితి ఉండబోదని ఆవేదన చెందారు. అందుకే గ్రామసభ ద్వారా పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానం చేశామని వెల్లడించారు. కచ్చితంగా పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వం పూనుకుంటే.. ప్రజల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలా కాకుండా పోలీసులను అడ్డు పెట్టుకొని పరిశ్రమ నిర్మిస్తే తమ ప్రాణాలు పోయినా సరే.. అడ్డుకుని తీరుతామని గ్రామస్తులు హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు తీర్మానం కాపీ అందజేశారు. ప్రజాభీష్టం మేరకు ఇథనాల్ పరిశ్రమ స్థాపించేలా తమతో సహకరించాలని గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు కోరారు.

నైపుణ్యంగల కార్మికులకు ఉపాధి అవకాశాలు

జగిత్యాల: అర్హత, నైపుణ్యం గలకార్మికులు టామ్‌కామ్ వెబ్‌సైట్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్తమ్మ సూచించారు. ఈమేకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ(టామ్‌కామ్), తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ఉందని ఆమె వివరించారు. అర్హతగల, నైపుణ్యం కలిగిన కార్మికులకు విదేశీ ప్లేస్‌మెంట్ సులభతరం చేసేందుకు నిర్దిష్ట ఆదేశాలతో అది పనిచేస్తోందని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ రెజ్యూమ్‌ను **tamcom.placementmanager@gmail.com** వెబ్‌సైట్‌కు ఈమెయిల్‌కు పంపించాలని సూచించారు. ఇందులోనే తమ పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 95028 94238 మొబైల్ నంబరులో సంప్రదించాలని కోరారు.

- మిస్సయిన స్ట్రాంగ్‌రూమ్ తాళపు చెవులు !
- 5గంటలపాటు అధికారుల అవస్థలు

మాయం చేశారా?

మాయమయ్యాయా?



తాళం తెరిచేందుకు యత్నిస్తున్న అధికారులు



స్ట్రాంగ్‌రూమ్ వద్ద కాంగ్రెస్ నాయకుల హడావుడి

ప్రతినెలా 3న తనిఖీ

- స్ట్రాంగ్‌రూమ్ గదులను ప్రతినెలా మూడోతేదీన కలెక్టర్ నేతృత్వంలో అధికారులు తనిఖీ చేస్తూ ఉన్నారు. తొలుత 2018లో అప్పటి కలెక్టర్ శరత్ ప్రతినెలా మూడోతేదీన స్ట్రాంగ్ రూములు తనిఖీ చేశారు. ఆ తర్వాత గుగులోతు రవి, ప్రస్తుతం షేక్ యాస్మిన్‌బాషా కూడా తరచూ గదులు తనిఖీ చేస్తున్నారు. కానీ, ఎవరూ తాళాలు తెరిచిచూడలేదు. కలెక్టర్లు బదిలీపై వెళ్లిన ప్రతీసారి ఇక్కడకు వచ్చే కలెక్టర్‌కు స్ట్రాంగ్ రూమ్ తాళపు చెవులు అప్పగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒకగది తాళపుచెవి పనిచేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారుల అవస్థలు..

కోర్టు అడిగిన 17ఏ, 17సీ సీసీ ఫుటేజీల రికార్డులు, డాక్యుమెంట్ల కోసం కలెక్టర్ యాస్మిన్ బాషా నేతృత్వంలో అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, అప్పటి ఎన్నికల అధికారి భిక్షపతి సోమవారం నూకపల్లి వెళ్లారు. అక్కడి మొదటి స్ట్రాంగ్‌రూమ్ తాళాన్ని 786006 నంబరు 'కీ'తో తెరిచారు. రెండో గది తాళాన్ని కూడా 786402 నంబరు 'కీ'తో తెరిచారు. కానీ, 17ఏ, 17సీ సీసీ ఫుటేజీల రికార్డులు, డాక్యుమెంట్లు భద్రపర్చిన గది తాళాన్ని 786051 నంబరు 'కీ'తో తెరిచేందుకు యత్నించినా అది ఎంతకూ ఓపెన్ కాలేదు. దాదాపు ఐదు గంటలపాటు అధికారులు నానాతంటాలు పడినా తాళం తెరుచుకోలేదు. దీనిపైనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'అడ్లూరి' ఆందోళన..

మూడోగది(స్ట్రాంగ్‌రూమ్) తాళం తెరుచుకోకపోవడంపై కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తాళం పగులగొడతామని ఉన్నతాధికారులు చెప్పడంతో అడ్లూరి అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులపై ఆయన తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు దృష్టికి తీసుకెళ్లాక తుది నిర్ణయం తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. దీంతో ఐదుగంటలపాటు అధికారులు నిరీక్షించారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్‌బాషా మాట్లాడుతూ, తాళంచెవి ఉన్నా.. తాళం రావడంలేదని, ఈవిషయాన్నే హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్ తరఫున డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్, అడ్వకేట్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వీరి సమక్షంలోనే తాళాలు తెరిచే ప్రక్రియ చేపట్టారు.

- సోమవారం కలెక్టర్ యాస్మిన్ బాషా నేతృత్వంలో మొదటి, రెండో గది తాళాలు తీయగా, అందులోని ఈవీఎంలు కనిపించాయి.
- ఆ తర్వాత మూడోగది తాళం తీసేందుకు యత్నించగా అది మొరాయించింది.
- ఇక్కడే అసలు సమస్య మొదలైంది. మూడో గది తాళపు చెవి పనిచేయలేదా? లేక దానిస్థానంలో మరోటి తీసుకొచ్చారా? లేదా కావాలనే ఎవరైనా ఇలా చేశారా? లేక సాంకేతిక సమస్యలు ఏమైనా ఉన్నా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

జగిత్యాల: జిల్లాలోని మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్నికల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తాళాలు తెరుచుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం ఉందని కొందరు, సాంకేతిక కారణాలు అయి ఉండొచ్చని అధికారులు, కావాలనే ఇలా చేస్తున్నారని బాధితుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరస్పర ఆరోపణలకు దిగడం ఇందుకు బలం చేకూర్చుతున్నాయి. అయితే, తాళపు చెవులు కావాలనే మార్చారా? లేక మాయం చేశారా? లేక నిర్లక్ష్యంగా వ్యవహరించారా? లేక మరోదైనా కారణం ఉందా? అనే దానిపై జిల్లావ్యాప్తంగా చర్చ జోరందుకుంది.

వివాదాస్పదమైన స్వల్ప ఆధిక్యం..

జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2018లో జరిగిన ఎన్నికల కౌంటింగ్‌ను మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై టీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ స్వల్ప ఆధిక్యం(441ఓట్ల మెజారిటీ)తో గెలుపొందారు. అయితే, కౌంటింగ్‌లో అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అప్పట్లోనే హైకోర్టును ఆశ్రయించారు. ఈమేరకు అవసరమైన డాక్యుమెంట్లను హైకోర్టుకు మంగళవారం సమర్పించాల్సి ఉంది.

స్ట్రాంగ్‌రూముల్లో ఏముంది?

- మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్‌కాలేజీ(మూతపడ్డది)లోని మూడు గదుల్లో ఎన్నికల సామగ్రి భద్రపర్చారు.
- మొదటి గదిలో 001 నుంచి 107వ నంబరు వరకు, రెండోగదిలో 108 నుంచి 269వ నంబరు వరకు ఈవీఎంలు భద్రపర్చారు.
- మూడోగదిలో సీసీ కెమెరాలు, సీసీ ఫుటేజీలు, వీవీప్యాడ్లు, పలు డాక్యుమెంట్లు, ఇతర ఎన్నికల సామగ్రి ఉంచారు.

తేనేటీగల దాడి..

వీఆర్‌కే కళాశాల వద్ద ఉన్న అధికారులు, పాత్రికేయులపై తేనెటీగలు దాడిచేశాయి. దీంతో అధికారులు కాలేజీ నుంచి బయటకు పరుగులు తీశారు. కొందరు కార్ల డోర్లు తెరిచి లోనికి వెళ్లగా, మరికొందరు దూరంగా పరుగులు తీశారు. చాలారోజులుగా కాలేజీ మూసిఉండడంతో భవనం చుట్టూ తేనెతెట్టులు ఏర్పాటు చేసుకున్నాయి. జనం రద్దీ అధికం కావడంతో తేనెటీగలు దాడిచేసినట్లు భావిస్తున్నారు.

ప్రశాంతంగా పరీక్ష రాయాలి

జగిత్యాల: పదో తరగతి పరీక్షలను విద్యార్థులు ప్రశాంతంగా రాయాలని, ఎలాంటి ఆందోళన చెందకూడదని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం జరిగిన సైన్స్ పరీక్షకు 11,175 మంది విద్యార్థులకు 11,152 మంది విద్యార్థులు హాజరయ్యారని, 99.79శాతం హాజరు నమోదైందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా మూడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశామని, ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ చోటుచేసుకోలేదని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలంలో గుడిసెల ఏర్పాటుకు యత్నం

కోరుట్ల: స్థానిక జంబి గద్దె సమీప ప్రభుత్వ స్థలంలో సోమవారం పేదలు గుడిసెలు వేసుకునేందుకు యత్నించారు. సుమారు ఐదు ఎకరాల స్థలాన్ని చదును చేశారు. చెట్లు, ముళ్ల పొదలు నరికివేసి తగులబెట్టారు. అనంతరం తామే హద్దులు పెట్టుకున్నారు. తహసీల్దార్ రాజేశ్ గుడిసెల గురించి పోలీసులకు సమాచారం చేరవేశారు. ఎస్సై సతీశ్, తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాల్లో హద్దులు వేయడం సరికాదని అక్కడ ఉన్నవారిని వెనక్కి పంపించివేశారు. నిరుపేదలమైన తమకు ప్రభుత్వ స్థలం కావాలని కోరుతూ కోరుట్ల ఆర్డీవో, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందిస్తాని స్థలాల్లో గుడిసెలు వేసుకునేందుకు యత్నించిన వారు తెలిపారు.

భూసేకరణ నిలిపివేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

జగిత్యాలరూరల్: తాటిపల్లి, కండ్లపల్లి, చల్‌గల్, హన్మాజీపేట, చెర్లపల్లి, గోపాల్‌రావుపేట, పొరండ్ల, తిప్పన్నపేట గ్రామాల్లో చేపట్టిన ఎన్‌హెచ్–63 రహదారి భూసేకరణ పనులను నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఎన్‌హెచ్–63లో భూములు కోల్పోయేవారు చిన్న, సన్నకారు రైతులేనన్నారు. పంటలు పండిస్తూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు. భూములు కోల్పోతే బతుకుదెరువు ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోని జాతీయ రహదారికి ఇరువైపులా భూసేకరణ చేస్తే అభ్యంతరం లేదన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల హక్కులు కాపాడాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



దీక్షలో కూర్చున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: రిటైర్డ్ ఉద్యోగులకు హక్కులు కల్పించాలని, సీఎం కేసీఆర్ వారి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట రిటైర్డ్ ఉద్యోగులు సోమవారం చేపట్టిన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. పాత పింఛన్ విధానం అమలు చేయాలని, ఆదాయపన్ను నుంచి మినహాయింపు కల్పించాలని, నగదు రహిత వైద్య సేవలు అందించాలని, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, మధ్యంతర భృతి అందించాలని డిమాండ్ చేశారు. కాగా, మోరపల్లిలో ఎస్సీ సంఘ భవనానికి ప్రహరీ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీ భూమారెడ్డి, నాయకులు బొల్లె గంగారాం, వెంకటేశ్, దేవయ్య, నక్క గంగారాం.. జీవన్‌రెడ్డికి విన్నవించారు.

15వరకు సాగునీరు విడుదల చేయండి

సారంగాపూర్(జగిత్యాల): కాగా, డి–53 కాలువకు ఈనెల 15వ తేదీ వరకు నీటి విడుదలను పొడిగించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం నీటిపారుదల శాఖ సీఈ సుధాకర్‌రెడ్డికి విన్నవించారు.

నిధుల కేటాయింపులో కేంద్రప్రభుత్వం వివక్ష



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్(జగిత్యా): తెలంగాణకు నిధుల కేటాయింపులో కేంద్రప్రభుత్వం వివక్ష చూపుతోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ విమర్శించారు. 'మీరు.. నేను'లో భాగంగా సోమవారం కొల్వాయి గ్రామంలో ఎమ్మెల్యే పల్లెనిద్ర చేశారు. అంతకుముందు ఆయన పలు వార్డుల్లో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఉత్తమ సేవలు అందిస్తున్న తెలంగాణ రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం జాతీయస్థాయిలో పలు అవార్డులు ప్రకటించిందని గుర్తుచేశారు. ఒకవైపు అవార్డులు ఇస్తూనే మరోవైపు నిధుల కేటాయింపులో పక్షపాత ధోరణితో వ్యవహరించడం శోచనీయమన్నారు. అనంతరం గ్రామంలోనే రాత్రి బసచేశారు. మంగళవారం ఉదయం తాళ్లధర్మారం గ్రామంలో అరగుండాల ప్రాజెక్టు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేస్తారని నాయకులు తెలిపారు.

ప్రాణం తీసిన పాతపగలు

- రాజారంలో యువకుడి దారుణ హత్య
- కర్రలు, రాళ్లతో మోది హతమార్చిన వైనం
- జాతీయ రహదారిపై కుటుంబ సభ్యుల ధర్నా
- గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు



వెంకట ప్రవీణ్(ఫైల్)


మల్యాల(చొప్పదండి): పాత కక్షలు ఓ యువకుడి ప్రాణాలు తీశాయి. మద్యం మత్తులో ఉన్న ప్రత్యర్థులు కర్రలు, బండ రాళ్లతో కొట్టి చంపారు. ఈ సంఘటన రాజారం గ్రామంలో చోటుచేసుకుంది. హత్యను నిరసిస్తూ మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులు స్థానిక జాతీయ రహదారిపై శవంతో ధర్నా చేయడం కలకలం సృష్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులు, గ్రామస్తులకు మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది. పరిస్థితులు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకా రం.. రాజారం గ్రామానికి చెందిన గుర్రం వెంకట ప్రవీణ్(27) తన స్నేహితుడు గుర్రం వేంకటేశ్, మ రోఇద్దరితో కలిసి ఆదివారం అర్ధరాత్రి గ్రామ శివారులో మద్యం తాగారు. పాతకక్షలను దృష్టిలో పెట్టుకున్న అదే గ్రామానికి చెందిన అన్నదమ్ములు శివరాత్రి నరేశ్, భాగ్యరాజ్ అక్కడికి వెళ్లారు. వెళ్లడంతోనే వెంకట ప్రవీణ్‌పై కర్రలతో దాడి చేసి తీవ్రంగా కొట్టారు. కిందపడిన ఆ యువకుడిపై అక్కడే ఉన్న బండరాయితో తలపై మోదీ హత్య చేశారు. ఈ దాడిలో గుర్రం వేంకటేశం సైతం తీవ్రంగా గాయపడి ఆ స్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిందితులు పరా రీలో ఉన్నారు. సోమవారం ఉదయం నుంచి పోలీ సులు రాజారం గ్రామంలో పహారా కాస్తున్నారు.

జాతీయ రహదారిపై రాస్తారోకో..

వెంకట ప్రవీణ్ హత్య నేపథ్యంలో రాజారంలో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడి ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం ప్రవీణ్ మృతదేహాన్ని ఇంటికి తీసుకురాగా, వందలాదిమంది గ్రామస్తులు గుమిగూడారు. ప్రాణానికి ప్రాణం తీస్తామంటూ ఆగ్రహంతో జగిత్యాల–కరీంనగర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. డీఎస్పీ ప్రకాశ్, సీఐ రమణమూర్తి, ఎస్సైలు, స్పెషల్ ఫోర్స్ బలగాలను మోహరించారు. బాధిత కుటుంబ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వీడియోలు తీస్తుంటే, గ్రామస్తులు కూడా పోలీసులను వీడియోలు తీయడంతో మరింత ఉద్రిక్తత నెలకొంది. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. రాస్తారోకో చేసి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంపై పలువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

- ఆధారాలు లభించకుండా హత్యలు
- సాంకేతిక పరిజ్ఞానానికీ చిక్కని నిందితులు
- లోతైన విచారణలో పోలీసులు
- ఎటూ తేలని హతుల వివరాలు

పక్కా ప్లాన్!



ఆధారాల కోసం డాగ్‌స్క్వాడ్ తనిఖీలు(ఫైల్)

జగిత్యాలక్రైం: మనిషి ప్రాణానికి విలువ లేకుండా పోతోంది. ఎవరైనా ప్రమాదంలో చిక్కుకుంటే రక్షించేందుకు చాలామంది యత్నిస్తారు. కానీ, కొందరు కరడుగట్టిన నేరస్తులు హత్యలు చేసి.. కేసుల నుంచి తప్పించుకునేందుకు అనువైనా మార్గాలన్నీ అనుసరిస్తున్నారు. ఇలాంటి వారిని పట్టుకునేందుకు పోలీసులు ప్రస్తుతం ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. కానీ, హంతకులు ఇంకో అడుగు ముందుకువేసి ఆధారాలేవీ లభించకుండా, పోలీసులకు పట్టుబడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందుకోసం వారు అనుసరిస్తున్న విధానాలేకాదు.. శాస్త్ర, సాంకేతిక పద్ధతులూ పోలీసులను విస్మయానికి గురిచేస్తున్నాయని ఆ శాఖలో చర్చ జోరుగా సాగుతోంది.

ముక్కలు చేస్తున్నారు.. నిప్పుపెట్టి కాల్చుతున్నారు..

- మృతదేహాలను గుర్తుపట్టకుండా హంతకులు మనిషి శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరుకుతున్నారు.
- ఆపై పెట్రోల్, డీజిల్, రసాయనాలు పోసి నిప్పంటించి కాల్చివేస్తున్నారు.
- ఇలాంటి కేసులను ఛేదించేందుకు పోలీసులు ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడడం తప్ప వేరే మార్గం అనుసరించలేకపోతున్నారు.
- పోస్టుమార్టం నివేదిక, డీఎన్‌ఏ రిపోర్టు ఆధారంగానే విచారణ చేస్తున్నారు.
- సాక్ష్యాధారాలు లభించక కేసు విచారణ ఏళ్లతరబడి కొనసాగుతోంది. హంతకులు ఎవరో తేల్చకుండా పోతోంది.

నిందితులను పట్టుకుంటాం



ముత్యంపేట శివారులో ముక్కలుగా లభించిన యువకుడి ఆచూకీ తెలుసుకునేందుకు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. నిందితులను గుర్తించేందుకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నాం. పోస్టుమార్టం నివేదిక, డీఎన్‌ఏ రిపోర్టు రాగానే విచారణను మరింతం వేగవంతం చేస్తాం. హతుల వివరాలు తెలిస్తే.. హంతకులను గుర్తించడం కాస్త సులభంగా ఉంటుంది. – భాస్కర్, ఎస్పీ

ముత్యంపేటలో జరిగింది ఇదే..

- జిల్లాలోని మల్యాల మండలం ముత్యంపేట శివారులో మార్చి 14న గుర్తుతెలియని యువకుడి మృతదేహం ముక్కలు ముక్కలుగా లభ్యమైంది. వైద్య పరీక్షల్లో సుమారు 18 – 25ఏళ్ల వ్యక్తిగా నిర్ధారణ అయింది. కానీ, నేటికీ ఆ యువకుడు ఎవరు, ఎక్కడివాడు, ఎవరు హత్య చేశారు? అనే విషయం తెలియరాలేదు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నా పోలీసులకు ఆ హతుని వివరాలు అంతుపట్టడం లేదు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా విచారణ కొనసాగిస్తూనే ఉన్నారు.
- మల్యాల మండలం కొండగట్టు పుణ్యక్షేత్రం సమీప గుట్టల ప్రాంతంలోని బొజ్జ పోతన్న ఆలయం చెంత 2019 జూలై 7వ తేదీన ఓ యువతి హత్యకు గురైంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. విచారణ చేపట్టారు. అయితే, యువతి వివరాలు నేటికీ తెలుసుకోలేకపోయారు. నిందితులనూ గుర్తించలేకపోయారు.

సాంకేతిక పరిజ్ఞానానికి చిక్కని హంతకులు

కొండగట్టు గుట్టల్లో జరిగిన యువతి హత్యతోపాటు ముత్యంపేట శివారులో జరిగిన యువకుడి హత్యలో నిందితులు, హతుల వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించారు. అయినా, హంతకుల గురించి ఏ ఒక్క ఆధారం కూడా చిక్కడం లేదు. హత్యలకు రెండురోజుల ముందు నుంచి ఆ మార్గాల్లో వాహనాల రాకపోకలకు సంబంధించి సీసీ కెమెరాల్లో రికార్డయిన సీసీ ఫుటేజీలు పరిశీలించినా ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదు. అలాగే సెల్‌టవర్ సిగ్నల్స్‌ను పరిశీలించినా.. అనుమానాస్పద కాల్స్ ఏవీ పోలీసుల దృష్టికి రాలేదు. హంతకులు క్రిమినల్ మైండ్‌తోపాటు పోలీసులకు ఎలాంటి ఆధారాలు దొరకకుండా పక్కా ప్రణాళికతో హత్య చేసి మృతదేహాలను ఆయా ప్రాంతాల్లో పడేసి వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఇందులోనూ హంతకులు పక్కా ప్రణాళికతో వ్యవహరించి తమ ఆధారాలేవీ పోలీసులకు లభించకుండా జాగ్రత్త పడ్డారని భావిస్తున్నారు.

పలు రాష్ట్రాలకు సమాచారం..

కొండగట్టు, ముత్యంపేట ప్రాంతాల్లో హత్యలకు గురైన యువతి, ఓ యువకుడి ఆచూకీ తెలుసుకునేందుకు మనరాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల పోలీసులకు కూడా మన పోలీసులు సమాచారం అందించారు. ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు తెలుసుకుని, వాటి ఆధారంగా విచారణ చేస్తున్నారు. యువకుడి మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. కానీ, శరీర భాగాలు దహనం చేసిన ప్రాంతంలో లభించిన కొన్ని వస్తువులపై పోలీసులు వేలిముద్రలు సేకరించారు. హంతకులను పట్టుకునేందుకు పలు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

లక్ష్యాన్ని మించి ఆదాయం



జగిత్యాల మార్కెట్‌లో అమ్మకానికి తెచ్చిన పసుపు

- జిల్లాలో 12 మార్కెట్ కమిటీలకు సమకూరిన భారీ ఆదాయం
- మొదటి స్థానంలో మల్యాల.. చివరి స్థానంలో జగిత్యాల

జగిత్యాల అగ్రికల్చర్ : వ్యవసాయాధారిత జిల్లాగా పేరుగాంచినజగిత్యాలలో సాగునీటి వనరులు ఎక్కువగా ఉండటంతో గతేడాదిలో పంటలు పుష్కలంగా పండాయి. దీంతో రైతులతో పాటు మార్కెట్ కమిటీలకు సైతం భారీగా ఆదాయం సమాకూరింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని మార్కెట్ కమిటీలు 'లక్ష్మీ' కటాక్షంతో కళకళలాడుతున్నాయి. జిల్లాలోని జగిత్యాల మార్కెట్ కమిటీ మినహా మిగిలిన 12 మార్కెట్ కమిటీలకు లక్ష్యాన్ని మించి ఆదాయం సమకూరింది. లక్ష్యాన్ని మించి అత్యధికంగా ఆదాయం సమకూరిన దానిలో మొదటి స్థానంలో మల్యాల మార్కెట్ నిలవగా చివరి స్థానంలో జగిత్యాల మార్కెట్ కమిటీ నిలిచింది.

జిల్లాలో 13 వ్యవసాయ మార్కెట్ కమిటీలు

జిల్లాలో జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, గొల్లపల్లి, ధర్మపురి, మల్యాల, కథలాపూర్, మేడిపల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, పెగడపల్లి, వెల్గటూర్, రాయికల్‌తో కలిపి 13 మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఈ మార్కెట్ యార్డులకు రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకవచ్చి విక్రయిస్తుంటారు. కొనుగోలు చేసే వ్యాపారులు ఉత్పత్తుల విలువపై ఒకశాతం మార్కెట్ ఫీజు మార్కెట్ కమిటీలకు చెల్లిస్తుంటారు. గ్రామాల్లో నేరుగా రైతుల వద్దనుంచి కొనుగోలు చేసినా, సదరు వ్యాపారులు సంబంధిత మార్కెట్ కమిటీకి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. సివిల్ సప్లై, మార్క్‌ఫెడ్ వంటి సంస్థలు కూడా ఫీజు చెల్లిస్తుంటుంది. ఇటీవలి కాలంలో ప్రభుత్వ సంస్థలు రైతుల నుంచి ధాన్యం, మొక్కజొన్న, కందులు, మినుములు, శనగలు వంటివి కొనుగోలు చేస్తుండటంతో, మార్కెట్ ఫీజు చెల్లించడం కొంచెం ఆలస్యం అయినప్పటికీ ఆదాయం భారీగా వస్తోంది.

రికార్డు స్థాయిలో..

జిల్లాలో ప్రతి సీజన్‌లో కనీసం 5 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేయగా, అందులో 3 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. వానాకాలం, యాసంగి సీజన్‌లోనే దాదాపు 10–12 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అవుతుంది. దీనికి తోడు, మొక్కజొన్న కూడా రెండు సీజన్లలో కలిపి దాదాపు 3–4 లక్షల క్వింటాళ్లు ఉత్పత్తి అవుతుంది. కందులు, పెసర్లు, అలిసెంద, నువ్వులు, పత్తి, పసుపు వంటి ఉత్పత్తులు సైతం అమ్ముతుంటారు. కొన్నేళ్ల నుంచి జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల మార్కెట్ కమిటీలకు మామిడికాయల అమ్మకం ద్వారా మార్కెట్ ఫీజు బాగా సమకూరుతుంది. ఇతర జిల్లాల్లో రైతుల ఉత్పత్తులు కొనుగోలు చేసినప్పటికీ, అక్కడ మార్కెట్ ఫీజు చెల్లించలేదంటే, చెక్ పోస్టుల ద్వారా సైతం మార్కెట్ ఫీజు వసూలు అవుతోంది. ఒక్కో మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో 2–3 చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు.

జగిత్యాల మార్కెట్ మినహా..

గడిచిన ఐదేళ్లలో సాధించిన ఆదాయం ప్రకారం జిల్లాలోని మార్కెట్ కమిటీలకు ఏటా లక్ష్యాన్ని నిర్దేశిస్తుంటారు. జిల్లాలోని 13 మార్కెట్ కమిటీల్లో ఒక్క జగిత్యాల మార్కెట్ మినహా మిగతా 12 మార్కెట్లు లక్ష్యాన్ని మించి ఆదాయం సాధించాయి. జిల్లాలో రూ.2152 లక్షల లక్ష్యానికి గాను, రూ.2,622 లక్షల ఆదాయాన్ని (121.88 శాతం) సాధించాయి. వచ్చే ఏడాదిలోనూ అత్యధిక ఆదాయం సంపాదించేందుకు మార్కెట్ కమిటీలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

జిల్లాలోని మార్కెట్ కమిటీల లక్ష్యం, ఆదాయం రూ. (లక్షల్లో..)

మార్కెట్	లక్ష్యం	ఆదాయం	శాతం
జగిత్యాల	336.00	322.85	96.09
మెట్‌పల్లి	180.0	225.60	125.33
కోరుట్ల	156.00	197.61	120.67
గొల్లపల్లి	149.00	167.30	112.28
ధర్మపురి	255.00	346.93	136.05
మల్యాల	215.00	295.38	137.39
కథలాపూర్	133.00	177.67	133.59
మేడిపల్లి	140.00	184.15	131.54
మల్లాపూర్	107.00	145.23	136.73
ఇబ్రహీంపట్నం	64.00	78.92	123.31
పెగడపల్లి	143.00	164.15	114.79
వెల్గటూర్	170.00	182.75	107.50
రాయికల్	104.00	134.24	129.08
మొత్తం	2152.00	2622.78	121.88

ఆనందంగా ఉంది



మార్కెట్ ఫీజును పకడ్బందీగా వసూలు చేయడంతోనే జిల్లాలో మొదటి స్థానంలో నిలిచాం. మల్యాల మార్కెట్ ఫీజు లక్ష్యం 215 లక్షలకు గాను, రూ.295.38 లక్షలు సాధించాం. మార్కెట్ కమిటీ సభ్యులు, సిబ్బంది సహకారంతో అనుకున్న లక్ష్యానికి చేరుకోవడం ఆనందంగా ఉంది.

– కోరండ్ల నరేందర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్, మల్యాల

అనుకున్న లక్ష్యం చేరుకున్నాం



జిల్లాలోని ఒక్క మార్కెట్ మినహా మిగతా 12 మార్కెట్లకు లక్ష్యాన్ని మించి ఆదాయం సమకూరింది. మార్కెట్ ఫీజును ఖచ్చితంగా వసూలు చేయడంతోనే అనుకున్న లక్ష్యాన్ని సాధించాం. వచ్చే ఏడాదిలో సైతం టార్గెట్‌ను చేరుకుంటాం. ఈ మేరకు ఆయా మార్కెట్లలోని సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేస్తున్నారు.

– ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జగిత్యాల

క్లుప్తంగా

పేపర్ లీకేజీ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

జగిత్యాల: టీఎస్‌పీఎస్సీ, పదో తరగగి పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట యూత్ కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే టీఎస్‌పీఎస్సీ, పదో తరగతి పేపర్లు లీకయ్యాయనన్నారు. నిరుద్యోగులతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఇక్కడ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండ మధు, నేహాల్, జీవన్, కిరణ్, శివ, బాపురెడ్డి, రియాజ్, ప్రదీప్, అనిల్ పాల్గొన్నారు.

యువకుడి మృతికి కారణమైన ఐదుగురి అరెస్టు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కందెనకుంట శివారులోని వాగులో విద్యుత్ తీగలు అమర్చి యువకుడి మృతికి కారణమైన ఐదుగురిని సోమవారం అరెస్టు చేసినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీ ఖాన్ తెలిపారు. ఈ నెల 2న కందెనకుంట గ్రామానికి చెందిన వెంకటేశ్, శేఖర్, సంజీవ్, బీర్‌పూర్ శివారు గ్రామం ఆసునూరిగూడెంకు చెందిన గంగాధర్, కమలాకర్ కందెనకుంటకు చెందిన గడ్డం ధర్మేశ్ (18)ను చేపలుపట్టేందుకు వారితో తీసుకెళ్లారు. తల్లి రామక్క ఫిర్యాదు మేరకు ఏఎస్సై రవీందర్ కేసు నమోదు చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోరుట్ల : రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని సి.ప్రభాకర్ భవన్‌లో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై చర్చించారు. లేబర్ కార్డు ఉండి ఐదేళ్లు నిండిన కార్మికులకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని, జిల్లాలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జూన్ నెలాఖరు వరకు జిల్లా మహాసభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, కార్యదర్శి ఎండీ ముక్రం, సీనియర్ నాయకుడు చెన్న విశ్వనాథం, భవణ నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి రామిల్ల రాంబాబు, ఎం. కిరణ్, ఎన్. రాధ, ఎండీ ఉస్మాన్, హనుమంతు, శ్రీనివాస్, మహేశ్, సమీర్, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



శంకరయ్య మృతదేహం

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని సంతోష్‌నగర్‌లో సోమవారం సాయంత్రం పొడెటి శంకరయ్య (50) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పెగడపల్లి మండలం సుద్దపల్లి గ్రామానికి చెందిన శంకరయ్య కొంతకాలంగా జగిత్యాలలోని సంతోష్‌నగర్‌లో సెక్యురిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అప్పులు ఎక్కు వ కావడంతో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సైసందీప్‌తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి



బొడ్డు సాగర్ ఫైల్

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన బొడ్డు సాగర్ (30) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన ప్రకారం సాగర్ కొన్నేళ్లుగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గ్రామ శివారులో ఎస్సారెస్పీ వరదకాలువ నుంచి మట్టిని తరలించేందుకు ఆదివారం ఉదయం ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడు. అలసటగా ఉందని తోటి డ్రైవర్లకు చెప్పి అక్కడే ఉండిపోయాడు. ఆదివారం సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఎస్సారెస్పీ వరదకాలువ సమీపంలో చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. కాలుకు, తలపై గాయాలుండటంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం ఉదయం పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలాన్ని ఏఎస్సై ఎండీ ఆలీమోద్దిన్ పరిశీలించారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం దర్యాప్తు చేస్తామని తెలిపారు. దీనిపై కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ ఫోన్‌లో ఆరాతీశారు. మృతుడికి మూడేళ్ల క్రితం వివాహం జరగగా సంతానం కలుగలేదు. ఈ మేరకు మృతుడి తండ్రి లింగయ్య పోలీసులకు ఫిర్యాదుచేశారు.

బ్యాంకు లింకేజీ పూర్తి చేయాలి

- డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ

జగిత్యాల జోన్: లక్ష్యం మేరకు బ్యాంకు లింకేజీ పూర్తి చేయాలని డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా సమైక్య కార్యాలయంలో సోమవారం సెర్ప్ ఏపీఎం, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెర్ప్ కార్యక్రమాల్లో జిల్లా ముందంజలో ఉందని, ఈ ఆర్థిక సంవత్సరంలోనూ అదే స్ఫూర్తితో ముందుకెళ్లాలని కోరారు. సెర్ప్ సిబ్బంది మార్కెటింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక వసతులు ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదీర్, డీపీఎంలు మల్లేశం, మాణిక్‌రెడ్డి, వనజ, జిల్లాలోని మండలాల ఏపీఎంలు, బీఎంజీలు, సీసీలు, సెర్ప్‌సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఒకరికి జరిమానా..

జగిత్యాల జోన్/కోరుట్ల : విద్యుత్ చౌర్యానికి పాలప్డిన ఓ వ్యక్తికి రూ.33,552 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి ఆడెపు వీరయ్య సోమవారం తీర్పుచెప్పారు. ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి కథనం ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని బిలాల్‌పురకు చెందిన ఎల్లుటపు నరేశ్ తన ఇంటికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తుండగా విద్యుత్ అధికారులు పట్టుకొని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. మొదటి తప్పుగా భావించి రూ.2 వేలు జరిమానా విధించారు. జులై, 12, 2018న మరోసారి అక్రమంగా విద్యుత్‌ను విని యోగిస్తుండగా అధికారులు పట్టుకొని విజి లెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయగా నరేశ్‌పై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం నరేశ్‌కు రూ.33,552 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకపోతే ఆరునెలల సాధారణ జైలు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సైలు నిరంజన్‌రెడ్డి, నరేశ్‌ను సీఐ స్వామి అభినందించారు.

తాతను చంపిన మనుమడికి యావజ్జీవ శిక్ష

జగిత్యాల జోన్ : తాతను చంపిన మనుమడికి యావజ్జీవ శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జిల్లా జడ్జి ఏ.వీరయ్య సోమవారం తీర్పుచెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాసారపు మల్లేశం కథనం ప్రకారం.. మేడిపల్లి మండలంలోని కల్వకోట గ్రామానికి చెందిన అదె మల్లయ్యకు ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. కుమారులు, కూతురుకు పెళ్లిళ్లై పిల్లలు పుట్టాక ముగ్గురు మృతిచెందారు. దీంతో మలయ్యకు ఒకనెల పెద్ద కోడలు, మరోనెల చిన్నకోడలు తిండి పెట్టేది. మల్లయ్య చిన్నకొడుకు మురళికి ఇద్దరు కుమారులు చందు, రవీరాజ్ ఉన్నారు. చందుకు భార్య, కొడుకు ఉన్నారు. చందు జులాయిగా తిరుగుతూ భార్య మధుప్రియ, తల్లి గంగును వేధిస్తుండేవాడు. గ్రామానికి చెందిన గోడ వెంకటితో గొడవపడి జైలులో ఉండి వచ్చాడు. జనవరి 17, 2022న భార్య, తల్లితో గొడవపడగా వారు ఇంట్లోంచి వెళ్లిపోయారు. తన భార్య, తల్లి వెళ్లిపోవడానికి తాతే కారణమని గ్రామ పంచాయతీ వద్ద కూర్చున్న మల్లయ్యపై దాడిచేయగా అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, మేడిపల్లి పోలీసులు కేసునమోదు చేశారు. అప్పటి సీఐ రాజశేఖర్ రాజు కేసు దర్యాప్తు చేసి నిందితుడు చందును అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ బృంద సభ్యులు డి.శ్రీధర్, డి. ఎల్లయ్య, కిరణ్‌కుమార్ కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టారు. చందుకు యావజ్జీవ శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తంగళ్లపల్లి (సిరిసిల్ల) : మండలంలోని పద్మనగర్ గ్రామశివారు ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామానికి చెందిన టేకు మల్లేశం (45) బద్దెనపల్లికి చెందిన బావ బాలయ్య ఇంటికి వచ్చాడు. సిరిసిల్లకు వెళ్లి తిరుగు ప్రయాణంలో పద్మనగర్ గ్రామ శివారు ప్రధాన రహదారి వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశం అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలు..

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని కిష్టంపల్లెకు చెందిన లింగారి లస్మమ్మ(55) బావిలో పడి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఉదయం లస్మమ్మ ఇంటి ముందున్న చేదబావిలో పిల్లి పడింది. దీంతో ఆమె బకెట్‌కు తాడుకట్టి, పిల్లిని బయటకు తీస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయింది. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మస్తాన్ పేర్కొన్నారు.

సైబర్ నేరాల కట్టడికి..

- పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు
- ఆన్‌లైన్ మోసాలపై తరగతులు
- జిల్లాలో 60 పాఠశాలలు ఎంపిక



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చినప్పటినుంచి సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లా పోలీస్ శాఖ షీటీమ్స్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం చేపడుతోంది. విద్యార్థులతో పాటు పలువురికి అవగాహన కల్పించి సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు కార్యక్రమాన్ని చేపట్టారు.

అవగాహన కల్పించేలా చర్యలు..

షీ టీమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ అవగాహన కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 60 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న నలుగురు విద్యార్థుల చొప్పున మొత్తం 240 మందిని ఎంపిక చేశారు. వీరితోపాటు ఆయా పాఠశాలలకు ఇద్దరు ఉపాధ్యాయుల చొప్పున 120 మందిని మొత్తంగా 360 మందిని ఎంపికచేసి వారికి సైబర్ అంబాసిడర్లుగా అవగాహన కల్పించి మిగతా వారికి అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టారు.

ఆన్‌లైన్ ద్వారా క్లాసులు

ఎంపిక చేసిన సైబర్ అంబాసిడర్స్, షీటీం పోలీసులు, కంప్యూటర్ నాలెడ్జ్ ఉన్న పోలీసు అధికారులు, ఉద్యోగులతో గ్రూప్ ఏర్పాటు చేశారు. ఈ గ్రూపు ద్వారా ప్రతీనెలా ఆన్‌లైన్ ద్వారా క్లాసులు నిర్వహిస్తున్నారు. సైబర్ నేరస్తులు మోసాలకు ఎలా పాలప్డతారు, తీసుకునే చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ నేరస్తుల నుంచి వచ్చిన ఫోన్‌కాల్స్ ఎలా గుర్తించాలనేది వివరిస్తున్నారు. అంబాసిడర్లు విన్న విషయాలను ఉపాధ్యాయుల సహకారంతో తోటి విద్యార్థులకు చెప్పాలి.

ప్రజల్లో అవగాహన కల్పించేందుకే



సైబర్ నేరాలను అదుపు చేసేందుకే ప్రజల్లో చైతన్యం తెచ్చేలా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులకు శిక్షణనిస్తున్నారు. అందుకు సైబర్ అంబాసిడర్లను తయారు చేస్తున్నాం. విద్యాశాఖ అధికారులు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారు.

– వేంకటేశ్వర్, షీటీం ఎస్సై

అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలను అరికట్టేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి.

– ఎగ్గడి భాస్కర్, ఎస్పీ

గోదావరినదిలో యువకుడి మృతదేహం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కనిపించకుండా పోయిన గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన ఎర్రోజు రాజేశ్(34) ఇటుక బట్టీల సమీపంలో గోదావరినదిలో చనిపోయి కనిపించాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్ గోదావరిఖని లక్ష్మీనగర్‌లో గోల్డ్ షాపు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై, దుకాణం అమ్ముకున్నాడు. అతిగా మద్యం తాగడం వల్ల అనారోగ్యానికి గురయ్యాడు. మూడు నెలల క్రితం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి, వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. లివర్ చెడిపోయిందని వైద్యులు చెప్పడంతో నెల రోజులపాటు మద్యానికి దూరంగా ఉన్నాడు. ఆ తర్వాత మళ్లీ తాగడం మొదలుపెట్టడంతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. రాజేశ్‌ను అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు వెంటాడటంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో గత శనివారం తన స్నేహితుడి బైక్ తీసుకొని, అర్ధరాత్రి సమయంలో గోదావరి బ్రిడ్జి వద్దకు వెళ్లాడు. అక్కడ వాహనాన్ని పార్కింగ్ చేసి, నదిలో దూకాడు. బైక్ బ్యాగులో ఉన్న అతని ఆధార్ కార్డు ఆధారంగా పోలీసులు రాజేశ్‌గా గుర్తించారు. మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మెట్‌పల్లి: పట్టణంలోని రాంనగర్‌కు చెందిన తులసీరాం ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తులసీరాం ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఊరికి వెళ్లాడు. సోమవారం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న ఆరుతులాల బంగారం, 12 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.22వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు.

సౌదీలో సిరికొండ వాసి మృతి



సంజీవ్ (ఫైల్)

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన దండిక సంజీవ్ (35) సౌది అరేబియాలో గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సంజీవ్ ఎనిమిదేళ్లుగా సౌదీ అరేబియాకు వెళ్లి వస్తున్నాడు. సౌదీలోని దమామ్ పట్టణంలో కార్మికుడిగా పనిచేసేవాడు. మూడునెలల క్రితం స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. రోజుమాదిరిగా సోమవారం విధులకు వెళ్లగా గుండెలో నొప్పి ఉందని మిత్రులకు తెలిపాడు. వా రు ఆస్పత్రి తరలించేలోపు మృతిచెందాడు. అనంతరం వారు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నా రు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా ప్రభుత్వం చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కూలిన ఇంటి పైకప్పు

- త్రుటిలో తప్పిన ప్రమాదం



ఇంటిని పరిశీలిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల) : మండలకేంద్రంలోని కిషన్‌దాస్‌పేటలో ఒగ్గు శివకుమార్‌కు చెందిన ఇంటి పైకప్పు కూలగా త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. శివకుమార్ భార్య, తల్లి ఎల్లవ్వతో కలిసి నివాసముంటున్నారు. సోమవారం వారి పిల్లలు ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా పెద్దశబ్దం వచ్చింది. దీంతో వారి ఎల్లవ్వ వద్దకు పరుగులు తీశారు. ఎలాంటి ప్రాణ నష్టం జరుగకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న ఉపసర్పంచ్ ఒగ్గు రజిత ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

దాడి కేసులో బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడి రిమాండ్

రామగిరి(మంథని): నాగేపల్లికి చెందిన పోలు మధుపై దాడి చేసి, గాయపర్చిన బీఆర్‌ఎస్ రామగిరి మండల యూత్ అధ్యక్షుడు కొండవేన సుధాకర్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కటికె రవిప్రసాద్ తెలిపారు. అతన్ని కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారని పేర్కొన్నా రు. గత నెల 22న ఉగాది పర్వదినం రోజు నాగేపల్లిలోని ఎ–బ్లాక్‌లో సీసీరోడ్డు వేస్తున్నారు. ఓ దినపత్రికలో విలేకరిగా పని చే స్తున్న మధు ఫొటోలు తీస్తున్నాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న నాగేపల్లి సర్పంచ్ కొండవేన ఓదెలుయాదవ్ కుమారులు ప్రభాకర్, సుధాకర్‌లు తనపై అకారణంగా దాడిచేశారని, మధు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు దాడి కేసులో రిమాండ్ కావడం చర్చనీయాంశంగా మారింది.